బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన సుబేదారి పోలీసులు

ప్రజాపాలన కాదు.. నిర్బంధ పాలన

కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి

సుబేదారి, మార్చి 18 : రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదు.. నిర్బంధ పాలన అని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి విమర్శించారు. చలో ఉస్మానియా యూనివర్శిటీ నేపథ్యంలో మంగళవారం సుబేదారి పోలీసులు ముందస్తుగా బీఆర్ఎస్, విద్యార్థి సంఘం నేతలను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో అన్ని వర్గాలకు చెందిన ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధాలపై మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టయిన వారిలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి రజనీకుమార్, విద్యార్థి సంఘ నాయకులు కంజర్ల మనోజ్, రామ్మూర్తి, శరత్‌చంద్ర, రాకేశ్‌యాదవ్ ఉన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు..

శాయంపేట : బెదిరింపులు, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ అన్నారు. శివను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాజిక ప్రజా ఉద్యమాలకు వేదిక అయిన ఓయూలో విద్యార్థుల నిరసన కార్యక్రమాలు నిషేధించడం అన్యాయమన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

రమేశ్ గౌడ్(ఫైల్)

ఐనవోలు, మార్చి 18 : చేతికందొచ్చి ఎండిపోతున్న పొలానికి నీళ్లు పెట్టేందుకు తెల్లవారుజామునే వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ ఘటన కొండపర్తిలో మంగళవారం జరిగింది. ఎస్సై పస్తం శ్రీనివాస్, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాల్నె రమేశ్ గౌడ్ (45) కులవృత్తితో పాటు వ్యవసాయం చేస్తున్నాడు. తనకున్న ఎకరంనర భూమిలో వరి సాగు చేయగా, బోరు బావిలో నీళ్లు అడుగంటుతున్న క్రమంలో ఉదయమే నీళ్లు పారించేందుకు వెళ్లాడు. మోటర్ పని చేయకపోవడంతో బోరు వద్ద అటు, ఇటు తిరిగే క్రమంలో, కట్ అయి ఉన్న విద్యుత్ తీగకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై పక్కనే ఉన్న ఒర్రెలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన పక్క రైతులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నీళ్లలో ఉన్న రమేశ్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య శోభారాణి, ఇద్దరు కుమార్తెలుండగా వీరిలో ఒకరికి వివాహమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డంపింగ్ యార్డు తరలింపే లక్ష్యం

మడికొండ, మార్చి 18 : మడికొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రేటర్ వరంగల్ చెత్త డంపింగ్‌యార్డు తరలింపే లక్ష్యంగా అడ్‌హక్ కమిటీ సభ్యులు మంగళవారం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కరప్రతాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మడికొండతో పాటు చుట్టుపక్కల ఉన్న 16 గ్రామాల్లో ఉన్న ఇండ్ల కంటే డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తా చెదారం, వ్యర్థాల కుప్పలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

ఎంజీఎం ఆస్పత్రికి నూతన పరికరాల అందజేత

వరంగల్ చౌరస్తా, మార్చి 18 : ఎంజీఎం హాస్పటల్ వైద్య సేవలను మెరుగుపరచడం కోసం అపోలో హాస్పిటల్ బిలియన్ హార్ట్స్ బీటింగ్ ఫౌండేషన్ ఆధునిక యంత్ర పరికరాలను అందించడం అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం బీటింగ్ ఫౌండేషన్ ప్రతినిధి సుధా జిజారియా అందజేసిన రేడియంట్ వార్మర్స్, ఫొటోథెరపీ యంత్ర పరికరాలను ఆమె మంగళవారం ఎంజీఎం హాస్పిటల్ పీడియాట్రిక్ వార్డు నవజాత శిశువుల విభాగంలో ప్రారంభించారు. అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కామినేని సహకారంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ నిధులు రూ.5 లక్షలతో రెండు రకాల ఆరు యంత్ర పరికరాలు కొనుగోలు చేసి ఎంజీఎం హాస్పిటల్‌కి ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం డీఆర్వో విజయలక్ష్మి, ఫౌండేషన్ ప్రతినిధి సుధా జిజారియాకు ఎంజీఎం వైద్యాధికారులు మొక్కలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ విభాగాధిపతి అపర్ణ, ప్రొఫెసర్ అలిమేను, ఆర్ఎంవో అంబి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య

దామెర, మార్చి 18 : ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం సీతారాంపురం, దుర్గంపేట, దామెర గ్రామాలను సందర్శించారు. సీతారాంపురంలో ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించారు. గ్రామంలో, మండలంలో తాగునీటి సమస్య ఉందా అంటూ మిషన్ భగీరథ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దామెరలో నీటి సమస్య ఉందని, నూతనంగా పైపులైన్ నిర్మించాలని కలెక్టర్‌కు అధికారులు వివరించగా, వెంటనే సమస్య పరిష్కారంకోసం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ శివారులో కోళ్ల పెంపకం కోసం ఏర్పాటు చేస్తున్న షెడ్స్‌ను పరిశీలించారు. గ్రామాల్లో రైతులు డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను పెంచే విధంగా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అక్కడి నుంచి దుర్గంపేటకు చేరుకున్న కలెక్టర్ ఇటీవల కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలించారు. గ్రామాల్లో ఈజీఎస్ పథకం కింద మంజూరైన రోడ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. దామెరలో మహిళా కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. త్వరలోనే ఇక్కడ మహిళలకు శిక్షణ ఇవ్వనున్నటు తెలిపారు. డీఆర్డీవో శ్రీను, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస రావు, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి పాల్గొన్నారు.

హనుమకొండ : రక్తదానం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

రక్తదానం చేసి.. స్ఫూర్తిగా నిలిచిన కలెక్టర్

హనుమకొండ : సమాజంలో ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయం వద్ద తలసీమియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ రక్తదానం చేసి ఉద్యోగులు, దాతలకు స్ఫూర్తిగా నిలిచారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రామ్‌రెడ్డి, ఎస్టీవో శ్రీనివాస్‌రెడ్డి, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు పెద్ది వెంకటనారాయణగౌడ్, ఈవీ శ్రీనివాసరావు, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

భగీరథ నీటి సరఫరా పునరుద్ధరణ

శాయంపేట మార్చి 18 : మండలంలోని మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు డీఈ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. వేసవి దృష్ట్యా తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మండలంలోని జోగంపల్లి మిషన్ భగీరథ పంప్ హౌస్‌లో మైలారం జీఎల్బీఆర్ మెయిన్ పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులను వేగంగా పూర్తి చేసి మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో భగీరథ పైప్‌లైన్‌కు తాగునీరు సరఫరా చేసినట్లు చెప్పారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

సుబేదారి, మార్చి 18 : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ చంద్రశేఖర్ అన్నారు. జిల్లా ఎక్సైజ్, ట్రెజరీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది మంగళవారం సుబేదారి రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడాలన్నారు.

మహిళా సంఘాలు ఒకే గూటిలోకి..

సెర్ప్‌లో మెప్మా విలీనం.. ప్రతిపాదనలు రూపొందించిన ప్రభుత్వం

హనుమకొండ, మార్చి 18 : మహిళా సంఘాలను ఒకే గూటిలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా పట్టణ ప్రాంతాల్లో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న మెప్మాను ఇక నుంచి డీఆర్డీఏలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం చేయనున్నట్లు సమాచారం. ఇందుకు సంబందించిన ప్రతిపాదనలు సైతం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిసింది. డీఆర్డీఏలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో ప్రస్తుతం ఐదుగురు డీపీఎంలు, 17 మంది ఏపీఎంలు, సీసీలు 44 మంది, ఆఫీస్ సబార్డినేట్స్ ముగ్గురు, కంప్యూటర్ ఆపరేటర్స్ ముగ్గురు పని చేస్తున్నారు. మెప్మాలో డీఎంసీ, ఇద్దరు ఏడీఎంసీలు, జూనియర్ అసిస్టెంట్ కం డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్‌తో పాటు జీడబ్ల్యూఎంసీలో టీఎంసీ, 11 మంది సీవోలు, 25 మంది ఆర్‌పీలు, పరకాల మున్సిపాలిటీ పరిధిలో 22 మంది ఆర్‌పీలు విధులు నిర్వర్తిస్తున్నట్లు మెప్మా ఉద్యోగులు తెలిపారు. ఒక వేళ మెప్మాను సెర్ప్‌లో విలీనం చేస్తే ఉద్యోగులు కూడా సెర్ప్ పరిధిలోకి రానున్నారు. అయితే విలీనం విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు రాలేదని సెర్ప్, మెప్మా ఉద్యోగులు అంటున్నారు.

సామాజిక అభ్యున్నతికి భారత రాజ్యాంగం దోహదం

హనుమకొండ చౌరస్తా, మార్చి 18 : భారత రాజ్యాంగం సామాజిక అభ్యున్నతికి దోహదపడే విలువైన డాక్యుమెంట్ అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నారాయణ అన్నారు. కేయూలో 'భారత రాజ్యాంగం మైలురాయి సమస్యలు సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు ప్రారంభ సమావేశంలో మాట్లాడారు. సమసమాజ స్థాపన కోసం రాజ్యాంగ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. వీసీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య, కేయూ మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి, ఓయూ పూర్వాచార్యులు ద్వారకనాథ్, కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం, కేయూ పాలకమండలి సభ్యులు చిర్ర రాజు, క్యాంపస్ ప్రిన్సిపాల్ మనోహర్, సురేశ్‌లాల్ పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలు కాదు.. బతుకు మార్చే విధానాలు కావాలి'

హనుమకొండ, మార్చి 18 : తాత్కాలిక ప్రయోజనం కల్పించే సంక్షేమ పథకాలు కాదు.. కావాల్సింది బతుకు మార్చే విధానాలు తేవాలని, భూమిపై మహిళలకు హక్కు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పని ప్రదేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని, చట్ట సభలలో 33% రిజర్వేషన్లు మహిళలకు అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని సుందరయ్య భవన్‌లో అంబాల స్వరూప అధ్యక్షతన జరిగిన తెలంగాణ వ్యవసాయ మహిళా కూలీల జిల్లా సదస్సులో ఆమె మాట్లాడారు. గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తి రంగంలో మహిళల శ్రమ 78 శాతంగా ఉందని చెప్పారు. మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.2,500, భూమిలేని వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాములు, వాసుదేవారెడ్డి, స్వరూప, రజిత, రమ పాల్గొన్నారు.

సీపీని కలిసిన బల్దియా కమిషనర్

సీపీకి పూలమొక్క అందజేస్తున్న బల్దియా కమిషనర్

సుబేదారి, మార్చి 18 : వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్‌ను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో కమిషనర్ సీపీని కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వరంగల్ రేంజ్ ఏసీబీ ఏసీపీ సాంబయ్య సీపీ కార్యాలయంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

పల్లె దవాఖానను పరిశీలించిన కేంద్ర బృందం

ఆత్మకూరు, మార్చి 18 : జాతీయ స్థాయిలో అవార్డు కోసం కృషి చేస్తున్న ఆత్మకూరు మండలం పెద్దాపురం పల్లె దవాఖానను మంగళవారం కేంద్ర సభ్యులు పరిశీంచారు. పల్లె దవాఖాన బిల్డింగ్ నిర్మాణం, హెర్బల్ గార్డెన్, బయోవేస్టేజ్, రోగులకు అందించే సేవలపై అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో అప్పయ్య, వైద్యులు స్పందన, పద్మశ్రీ, పుష్పలీల, నర్సింగరావు పాల్గొన్నారు.

ఇంటర్‌సిటీ రైలులో తప్పిపోయి వచ్చిన బాలుడు

కాజీపేటలో చైల్డ్‌లైన్‌కు అప్పగించిన ఆర్పీఎఫ్

ఇంటర్‌సిటీ రైలులో తప్పిపోయి వచ్చిన బాలుడు

కాజీపేట, మార్చి 18 : ఇంటర్‌సిటీ రైలులో తప్పిపోయి వచ్చిన ఓ బాలుడిని ఆర్పీఎఫ్ సిబ్బంది చేరదీసి చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు మంగళవారం తెలిపిన కథనం ప్రకారం.. కాజీపేట జంక్షన్‌లో ఆర్పీఎఫ్ సిబ్బంది ఈ నెల 12న విధులు నిర్వర్తిస్తుండగా సిర్‌పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఇంటర్‌సిటీలో ఓ బాలుడు ఒంటరిగా కనిపించాడు. సిబ్బంది ఆ బాలుడిని ఆర్పీఎఫ్ ఠాణాకు తరలించి పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఊరు తదితర వివరాలను అడుగగా, చెప్పలేక పోయాడు. ఆ బాలుడు వయసు సుమారు 9 ఏళ్లు, 4 అడుగుల ఎత్తు ఉన్నట్లు చెప్పారు. బాలుడిని హనుమకొండలోని చైల్డ్‌లైన్‌కు అప్పగించామని తెలిపారు. బాలుడి తల్లిదండ్రులు లేదా సంబంధీకులుంటే కాజీపేట ఆర్పీఎఫ్ కార్యాలయం, నగరంలోని చైల్డ్‌లైన్ కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

ముగ్గురు కిడ్నాపర్ల అరెస్ట్

కాజీపేట, మార్చి 18 : కాజీపేటలో గతేడాది బాలుడిని కిడ్నాప్ చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మంగళవారం జరిగింది. కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీమాబాద్‌కు చెందిన భిక్షాటకురాలు షేక్ కౌసర్ (30) గతేడాది సెప్టెంబర్ 28న తన కుమారుడు అయాన్‌ను కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని ఫిర్యాదు చేసింది. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో ఎస్సై లవన్‌కుమార్ పెట్రోలింగ్ చేస్తుండగా, రైల్వే స్టేషన్‌లో రైలు కోసం వేచి ఉన్న ఓ వ్యక్తి పోలీసులను చూచి పారిపోతుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో ఆ వ్యక్తి తన పేరు సలీంఖాన్ అని తాను, హస్సేన్ తన్వీర్, మహ్మద్ అయూబ్, సాజిద్ కలిసి కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి గత ఏడాది అయాన్‌ను కిడ్నాప్ చేసి హైదరాబాద్‌లో భిక్షాటన చేయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు హస్సేన్ తన్వీర్, మహ్మద్ అయూబ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో కిడ్నాపర్ సాజిద్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. కేసును ఛేదించిన ఎస్సైలు నవీన్‌కుమార్, లవన్ కుమార్‌ను అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నయీంనగర్, మార్చి 18 : జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఎల్‌హెచ్‌పీ, మిడ్ లెవెల్ హెల్త్ కేర్ ప్రొవైడర్ (13 పోస్టుల్లో 5 జనరల్, బీసీ-ఏ 1, బీసీ-బీ 1, ఎస్సీ-1, ఈడబ్ల్యూఎస్-4, వికలాంగులు-1) పోస్టుల కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీకి ఈ నెల 19నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఎంహెచ్‌వో అప్పయ్య తెలిపారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం చదివి వయసు 18 నుంచి 46 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. దరఖాస్తులను hanumakonda.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని దరఖాస్తుతో పాటు District Medical & Health Officer, Hanumakonda పేరుపై SC, STలు రూ.250, ఇతరులు రూ.500 డీడీ(వికలాంగులకు ఫీజు మినహాయింపు), విద్యార్హతలు, కుల, నివాస సర్టిఫికెట్లు జత చేసి కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలన్నారు.

జయ నర్సింగ్ కళాశాల సీజ్

వరంగల్, మార్చి 18 : మూడేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించని జయ నర్సింగ్ కాలేజ్‌పై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కొరడా ఝుళిపించారు. రూ. 44 లక్షల మేర ఉన్న ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో పలుమార్లు నోటీసులు జారీ చేశారు. అయినా స్పందించకపోవడంతో రెడ్ నోటీసు జారీ చేసి మంగళవారం డిప్యూటీ కమిషనర్ రవీందర్ ఆధ్వర్యంలో కళాశాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. తమ కళాశాల వివాదం కోర్టులో ఉందని చెబుతూనే యాజమాన్యం తరగతులు నిర్వహిస్తున్నదన్నారు. మూడేళ్లుగా ఆస్తి, నల్లా పన్ను చెల్లించకపోవడంతో రెడ్ నోటీసు జారీ చేసి కమిషనర్ ఆదేశాలతో విద్యార్థులను బయటకు పంపించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు బల్దియా పరిధిలో 356 ఆస్తులు జప్తు చేశామన్నారు. ఆర్వో యూసుఫుద్దీన్, ఆర్ఐలు సురేశ్, రజిని, భరత్ చంద్ర, శ్రీకాంత్ ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు

సబ్ రిజిస్ట్రార్‌పై ఫిర్యాదు.. నోటీసులు జారీ చేసిన డీఆర్

హనుమకొండ, మార్చి 18 : రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు యథేచ్ఛగా కొనసాగిస్తూ సబ్ రిజిస్ట్రార్లు అక్రమ సంపాదన దందా కొనసాగిస్తున్నారే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. హనుమకొండ వందఫీట్ల రోడ్డులోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఓ సబ్ రిజిస్ట్రార్ అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతున్నది. అక్రమ సంపాదన కోసం ప్రైవేట్ వ్యక్తులు, తనకు అనుకూలంగా ఉన్న డాక్యుమెంట్ రైటర్లతో వ్యవహారం కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా సదరు రిజిస్ట్రార్ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో జిల్లా రిజిస్ట్రార్ ఆ సబ్ రిజిస్ట్రార్‌కు రెండు సార్లు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్‌ను వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు. జిల్లా రిజిస్ట్రార్ ఫణీందర్‌ను సంప్రదించగా నిబంధనలు అతిక్రమించి అక్రమంగా ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌కు నోటీసులు జారీ చేశామని, సరైన సమాధానం ఇవ్వకపోవడంతో రెండోసారి రిమాండర్ ఇచ్చామన్నారు. జవాబు వచ్చిన తర్వాత విచారణ జరిపి తప్పని తేలితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఓయూలో ఆంక్షలు ఎత్తివేయాలి

హనుమకొండ చౌరస్తా, మార్చి 18 : ఓయూలో ఆందోళనలను నిషేధిస్తూ విడుదల చేసిన జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్ర రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. ఇప్పటికైనా అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో బల్దియా ఎదుట ధర్నా

వరంగల్, మార్చి 18 : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బల్దియా ఎదుట మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో కార్మికులకు రూ. 26 వేల వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసిన విధంగా 452 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ.16,600, డ్రైవర్లకు రూ.20,500 వేతనాలను ఫిబ్రవరి నుంచి అమలు చేయాలన్నారు. ఎండాకాలం నేపథ్యంలో కార్మికులకు టోపీలతో పాటు భోజనం, మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయాలని కోరారు. అనంతరం అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో రాజారెడ్డి సీఐటీయూ నాయకులతో చర్చలు జరిపారు. తమ పరిధిలోని సమస్యలను పరిష్కారిస్తామని, వేతనం, కార్మికుల పర్మినెంట్ అంశాలపై ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బరుపట్ల మహేశ్, జన్ను ప్రకాశ్, నాయకులు సింగారపు బాబు, యాస బాబు, సింగారపు కృష్ణ, సువర్ణ, శ్రీలత, రాధిక పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధర్యంలో కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

చెట్లు నరికిన రోహిణి హాస్పిటల్ యాజమాన్యం

అడ్డుకున్న పర్యావరణ పరిరక్షకుడు

యాజమాన్యం నరికేసిన చెట్టు

హనుమకొండ, మార్చి 18 : హనుమకొండలోని రోహిణి హాస్పిటల్ యాజమాన్యం మంగళవారం హాస్పిటల్ ఆవరణలోని మూడు చెట్లను నరికి వేయించడానికి సిద్ధమైంది. మొదట కానుగ చెట్టును నరికి వేశారు. మరొక కానుగ, వేప చెట్టును సగానికి పైగా నరికి వేశారు. అటుగా వెళ్తున్న పర్యావరణ పరిరక్షకుడు దేశం కోసం ప్రకాశ్ ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసి చెట్ల నరికివేతను అడ్డుకున్నారు. హాస్పిటల్ యాజమాన్యంపై తక్షణమే వాల్టా యాక్ట్, ఆర్టికల్ 51 (ఏ/జీ)ఉల్లంఘించినందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ వినియోగదారులతో సీఎండీ ఫోన్-ఇన్

హనుమకొండ, మార్చి 18 : టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి గృహ, వ్యవసాయ, కమర్షియల్, పరిశ్రమల కొత్త సర్వీసుల పొందిన విద్యుత్ వినియోగదారులతో మంగళవారం నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. కొత్త సర్వీసుల మంజూరులో జాప్యం జరిగిందా? కాల పరిమితికి లోబడి మంజూరు చేస్తున్నారా? విద్యుత్ అధికారులు నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. వినియోగదారులు అభిప్రాయాలు తీసుకొని మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

'నాయీ బ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలి'

హనుమకొండ చౌరస్తా, మార్చి 18 : నాయీబ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలని హనుమకొండ పట్టణ చౌరస్తా అధ్యక్షుడు సింగారపు శ్యామ్ అన్నారు. హనుమకొండ పట్టణ నాయీబ్రాహ్మణ నూతన కమిటీ ఆధ్వర్యంలో మొదటి సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి జంపాల వేణు, సంఘ సభ్యులు మొగిలిచర్ల ప్రసాద్, తక్కలపల్లి గంగాధర్, మణిచందర్, వంగపల్లి హరీశ్ పాల్గొన్నారు.

రేపు జేఎన్ఎస్‌లో అథ్లెటిక్స్ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 18 : హనుమకొండ, వరంగల్ జిల్లాల అథ్లెటిక్స్ మీట్ కమ్ సెలక్షన్స్ ఈ నెల 20న హనుమకొండలోని జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి